
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

నేడు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు


- హాజరుకానున్న 5,801 మంది అభ్యర్థులు
- కంట్రోల్ రూమ్ నెంబరు 7032157040



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తిరుపతి కేంద్రంగా 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5,801మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారి సౌకర్యార్థం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 7032157040ను కేటాయించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ నేతృత్వంలో పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగనున్నాయి. మొబైల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. బస్టాండు నుంచి కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు.

నేడు రేణిగుంటకు సీఎం చంద్రబాబు రాక



తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రేణిగుంటకు రానున్నారు. అక్కడ జరిగే టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధి తుడా రోడ్డులో ఉన్న ఆర్‌పీఆర్ ఫంక్షన్ హాల్ చేరుకుంటారు. అక్కడ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు. 11.30 గంటలకు వెనుదిరిగి ఎయిర్ పోర్టు చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా కనపర్తిపాడు వెళతారు. అక్కడ జరిగే ఓ వివాహ వేడుకలకు హాజరై తర్వాత ఉండవల్లిలోని తన నివాసానికి వెళతారు. సీఎం రాక సందర్భంగా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. శనివారం విమానాశ్రయం నుంచి కళ్యాణ మండపం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పలు పర్యాయాలు ఎయిర్‌పోర్టు, అక్కడి నుంచి ఫంక్షన్ హాలు వెళ్లే మార్గం, ఫంక్షన్ హాలును పరిశీలించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.



ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుకను తవ్వి టిప్పర్‌లో నింపుతున్న దృశ్యం

స్వర్ణముఖిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్న మాఫియా

యంత్రాలతో తోడేస్తున్నారు

రీచ్‌లు లేకున్నా.. ఎక్కడైనా ఇసుక తీసుకోవచ్చు. అయితే, మనుషులతో తవ్వి ట్రాక్టర్లలో మాత్రమే ఉచితంగా తీసుకెళ్లాలి. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో నిబంధన. దీనిని కొందరు ఉల్లంఘిస్తున్నారు. యంత్రాలతో ఇసుక తవ్వి.. పెద్దపెద్ద టిప్పర్లలో ఇసుక తరలించేస్తున్నారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎక్స్‌కవేటర్లు, హిటాచీలు చేసే శబ్దాలు. ఒక్కొక్కటిగా వచ్చే టిప్పర్లు. ఇవీ తిరుపతి రూరల్ మండలంలోని స్వర్ణముఖీ నది పరివాహక ప్రాంతంలో కనిపించే దృశ్యాలు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వి తరలించేందుకు జరిగే పనులివి. నదిలోని ఇసుకను తవ్వితీసి నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లలో నింపుకుని తరలించి అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక మంచి ఇసుక దొరికేచోట్ల పరిధికి మించి జేసీబీ సాయంతో తవ్వేస్తుండడంతో నది రూపురేఖలు కోల్పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా పేట్రేగిపోయిన ఇసుక మాఫియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే తరహాలో ఇష్టారాజ్యంగా రేయింబవళ్లు ఇసుక తోడేసి అనధికారికంగా విక్రయిస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా మనుషులతో తవ్వి.. ఇసుకని ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఇసుక రీచ్‌లు లేని చోట్ల నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ నుంచి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. దీన్ని బేఖాతరు చేస్తూ అనధికారికంగా యంత్రాల సాయంతో ఇసుక తోడేస్తున్నారు. చిగురువాడ గ్రామ దక్షిణపుకం డ్రిగ రెవెన్యూ లెక్కదాఖలాలో సి.గొల్లపల్లె నుంచి దుర్గసముద్రం గ్రామానికి వెళ్లే లింకురోడ్డుకు తూర్పు దిశగా, సర్వే నంబరు219కు దక్షిణం వైపు స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారు. అలాగే గొల్లపల్లె, దుర్గసముద్రం, పైడిపల్లె, అడపారెడ్డిపల్లె, కేసీ పేట, తనపల్లె తదితర పంచాయతీల్లో నదిలోకి దారులను ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారని సమాచారం. ఈ నది పరివాహక ప్రాంతంలో గతంలో కొందరు పేదలకు నియమ, నిబంధనల మేరకు సాగు చేసుకునేందుకు లీజు పట్టాలను మంజూరు చేశారు. దీనిలో ఇసుక తరలించేందుకు ఎలాంటి హక్కులూ కల్పించలేదు. కొందరు ఇదే అదునుగా తప్పుడు రికార్డులు సృష్టించుకుని, ఈ భూమిపై తాము హక్కు కలిగి ఉన్నామని చెబుతూ.. ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను తవ్వితీసి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. పట్టపగలే యథేచ్ఛగా ఇసుకను టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. కాగా వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు ఇక్కడ ఇసుక రీచ్‌ని పెట్టేందుకు ప్రయత్నించగా స్థానికులతోపాటు సమీపంలోని గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. అలాగే స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక తరలింపును నిషేధించాలని చిగురువాడ గ్రామసభల్లోనూ ప్రత్యేక తీర్మానం చేశారు. జలవనరులు, భూగర్భశాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని డ్రౌట్ ఏరియాగా గుర్తించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే నదిలోని ఇసుకని ఇదేవిధంగా తరలిస్తూ పోతే రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, దీన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించాలని కోరుతున్నారు. అలాగే నదిప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి నియమ, నిబంధనల మేరకే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యంత్రాలతో తవ్వితే చర్యలు

ఎక్కడి నుంచైనా ఇసుక తీసుకోవచ్చు. మనుషులతో మాత్రమే తవ్వుకుని ట్రాకర్ల ద్వారా తీసుకెళ్లాలి. యంత్రాలతో నదిలోని ఇసుకని తవ్వితీసి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో స్థానిక రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా యంత్రాల సాయంతో ఇసుక తవ్వుతున్నారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదు.

- రామాంజులునాయక్, తిరుపతి రూరల్ తహసీల్దార్



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

నేత్రపర్వం శివయ్య ధ్వజారోహణం



పూజలు చేస్తున్న వేదపండితులు



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామివారి ధ్వజారోహణం శనివారం భక్తుల మధ్య నేత్రపర్వంగా సాగింది. ఉత్సవాల్లో రెండవ రోజు శనివారం ఉదయం స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.భేరి పూజతో మంత్రజలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు.అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. హారతులు సమర్పించి స్వామి అమ్మవార్ల తొలి ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం, రాజగోపురం మీదుగా దేవాంగ వాహనాల వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి స్వామి,అమ్మవారు వెండి అంబారి వాహనంపై ఆశీనులయ్యారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ పార్వతీ పరమేశ్వరుల పురవిహారం అంగరంగ వైభవంగా సాగింది. వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.కాగా ధ్వజారోహణం సందర్భంగా భక్తులు 4,508 కొడిచీరలను సమర్పించారు.

శాస్త్రోక్తంగా దర్భ ప్రదక్షిణ

అంబారి సేవ అనంతరం ధ్వజారోహణ మహోత్సవానికి అవసరమైన దర్భ, మామిడాకులు, దవళ పతాకాన్ని శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకాలయాల వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం దర్భను ఆలయంలోకి చేర్చారు.

అంగరంగ వైభవంగా పంచమూర్తుల ఊరేగింపు

శివ పరివార దర్శనం నేత్రపర్వంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, రాత్రి రెండుసార్లు పంచమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ముందుగా శివ పరివారమైన వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, భక్త కన్నప్ప, చండికేశ్వరుడు, స్వామి అమ్మవార్లు వెండి అంబారీలపై అధిరోహించి ఊరేగింపుగా సాగారు.

స్వర్ణతాపడ ధ్వజస్తంభానికి దర్భధారణ

స్వామివారి సన్నిధి ఎదురుగా ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఇందులో భాగంగా దేశకాల సంకీర్తన, గణపతిపూజ, కలశ ఆవాహన, పుణ్యాహవచనం, కలశ ఆరాధన, రక్షాబంధనాలను వేదమంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారు. స్వర్ణ తాపడ ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన కొడి చీరలు, దవళపతాకం, మామిడి ఆకులు ధ్వజస్తంభానికి ఎగురవేసి, దేవతలకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు భూత, శుక వాహన సేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్కో రాత్రిని ఒక్కో పేరుతో పిలుస్తారు. ఆదివారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇవ్వనున్నారు. ఉదయం సూర్యప్రభపై స్వామి వారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

గరుడుడిపై కల్యాణ వెంకన్న

- జనసంద్రమైన శ్రీనివాసమంగాపురం



చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి గరుడోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో శ్రీనివాసమంగాపురం జనసంద్రమైంది. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో మోహినీ అవతారంగా అలంకరించి పల్లకిపై అధిష్ఠించారు. తిరుచ్చి వాహనంపై నవనీత కృష్ణుడు రక్షణగా ఆలయ తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ తిరుమాడ వీధుల్లో అశ్వ, వృషభ, గజరాజులు ఠీవీగా నడుస్తుండగా చెక్క భజనలు, కోలాటాలు, పిల్లంగట్లు, కేరళ వాయిద్యాల నడుమ భక్తుల గోవిందనామ స్మరణలతో కీర్తిస్తుండగా స్వామివారు దర్శనమిచ్చారు. శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామికి తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన శ్రీలక్ష్మీకాసుల హారాన్ని టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభయాత్రగా శ్రీనివాసమంగాపురం ఆలయానికి తీసుకొచ్చి స్వామి వారికి అలంకరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

తుడా టవర్స్ వేలానికి సిద్ధం

- మార్చి 8 నుంచి ప్రారంభం
- వీసీ మౌర్య వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న వీసీ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస (తుడా) ప్రతిష్టాత్మకంగా తిరుపతిలో నిర్మిస్తున్న తుడా టవర్స్‌ను వేలానికి సిద్ధం చేస్తున్నారు. మార్చి 8వ తేదీ నుంచి వేలం నిర్వహిస్తున్నామని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నగరంలోని రాయలచెరువు రోడ్డులో 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్థుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. మొత్తం 250 ప్లాట్లు ఉంటాయని, అందులో 46 డబుల్ బెడ్ రూమ్స్, 152 ట్రిపుల్ బెడ్ రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్లు ఉంటాయన్నారు. విశాలమైన పార్కింగ్, వాణిజ్య సముదాయాలు, ఫ్లాట్లకు వేర్వేరుగా లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 2026 మార్చిలోపు అన్ని పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందులో భాగంగా మార్చి 8వ తేదీ నుంచి అన్ని అంతస్తుల విక్రయానికి వేలం నిర్వహించనున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు తుడా వెబ్‌సైట్‌లో, కార్యాలయంలోని రిసెప్షన్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 8న 2, 3 అంతస్తులకు, 9వ తేదీ 4, 5 అంతస్తులకు, 10వ తేదీ 6, 7 అంతస్తులకు, 11వ తేదీ 8, 9 అంతస్తులకు, 12వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో తుడా కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర పాల్గొన్నారు.



స్కూలు బస్సుల తనిఖీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా స్కూలు బస్సులను రవాణా, పోలీసు అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు తిరుపతి, పుత్తూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో డీఎస్పీలు రవికుమార్, చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు సూచనలు చేశారు. లైసెన్సు లేకుండా నడిపినా, పర్మిట్‌లు లేకున్నా వాహనాలను సీజ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. 40 కిలోమీటర్ల వేగ పరిమితి మించరాదన్నారు. స్కూలు యాజమాన్యాలు తరచూ డ్రైవర్లపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, రవికుమార్, పుత్తూరు ఎంవీఐ చంద్రశేకర్, అనిల్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ పిచికారీ ప్రదర్శన


డ్రోన్ ద్వారా పిచికారిపై అవగాహన కల్పిస్తున్న దృశం

చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో సాంకేతిక యాంత్రీకరణ వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శనివారం నారావారిపల్లి, భీమవరం, ఎం.కొంగరవారిపల్లి గ్రామాలలో వరి, మామిడి తోటల్లో తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో వ్యవసాయ డ్రోన్ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో జీవామృతం పిచికారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆహారం పండించడంలో ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ధ్రువీకరణ, ప్రకృతి వ్యవసాయంతో వినియోగించే వివిధ జీవ, వృక్ష సంబంధ ఉత్పత్తులు తయారీ, వినియోగం మొదలైన అంశాల గురించి వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పొలాల్లో డ్రోన్ వినియోగ ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాము కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు తలకోన శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వర స్వామి వార్షిక శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకుర్పాణ జరగనుంది. ఈనెల 26 వరకు బ్రహోత్సవాలు జరగనున్నాయి.

కనులపండువగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



లక్ష్మీకాసుల హారం అందజేస్తున్న టీటీటీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి - పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు

చంద్రగిరి ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి గరుడోత్సవానికి భక్తులు పోటెత్తారు. తొలుత తిరుమల శ్రీవారి ఆలయం నుంచి లక్ష్మీకాసుల హారాన్ని తీసుకుని తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభయాత్రగా శ్రీనివాసమంగాపురం ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన ఈ హారాన్ని గరుడసేవలో కల్యాణ వెంకన్నకు అలంకరించారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు. శోభయాత్రలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, సీవీఎస్వో మణికంఠ చందోలు, డిఎల్వో వరప్రసాద్‌రావు, వీజీవో సదాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. తిరుపతిలోని గోవిందరాజులు స్వామి ఆలయం నుంచి ఆండాళ్ అమ్మవారి మాలలను అంబారీపై తీసుకొని ఎస్వీ సంరక్షణశాల, తాటితోపు, పెరుమాళ్ళపల్లె మీదుగా వైభవంగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా వాటిని మూలవిరాట్‌కు అలంకరించారు. గరుడసేవలో ఉత్సవమూర్తికి అలంకరించారు. కార్యక్రమంలో పెద్దజీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి, డిప్యూటీ ఈవోలు వరలక్ష్మి, శాంతి, అధికారులు పాల్గొన్నారు.




మోహినీ అవతారంలో దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న - ఆండాల్ అమ్మవారి మాలలను తీసుకొస్తున్న దృశం - పల్లకీ ఉత్సవంలో వివిధ వేషధారణలో విద్యార్థులు

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

స్వామికి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆలయ అధికారులకు ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. ఆయన పట్టు వస్త్రాలను అందజేసి, స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు మేల్‌చాట్ వస్త్రాలను అధికారులకు అందజేసారు. బహ్మోత్సవాలలో ఆదివారం స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన

పాకాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పుష్పావతి కోరారు. కెవడ్డేపల్లెలో సర్పంచ్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టాదారు పాసుబుక్ ఉన్న రైతులందరూ ఆధార్ కార్డ్, ఆధార్‌కార్డుకు లింకయిన మొబైల్ నెంబరు తీసుకొచ్చి రైతు సేవా కేంద్రాలలో పార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పథకాలు వర్తించాలంటే 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణపిళ్లై, వీఏలు కౌశిక్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో మహిళలు నైపుణ్యాలు పెంచుకోవాలి


మహిళలతో ముఖాముఖిలో పులివర్తి సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శిక్షణా తరగతుల ద్వారా నైపుణ్యాలను పెంచుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి కోరారు. తోటతిమ్మయ్యగారిపల్లె, మొగరాల, రమణయ్యగారిపల్లె పంచాయతీల్లో శనివారం మహిళలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు.. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, సర్పంచ్ మదునాయుడు, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు చాముండేశ్వరి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, అరుణ, మీనా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లమధ్య వైన్‌షాప్ వద్దంటూ మహిళల నిరసన

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో వైన్‌షాప్ వద్దంటూ శనివారం లింగేశ్వరనగర్ పంచాయతీకి చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో వైన్‌షాప్ ఏర్పాటుకు చేపడుతున్న షెడ్డు నిర్మాణ పనులను పలువురు మహిళలు చేరుకుని అడ్డుకున్నారు. సత్వరమే నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరికి సర్పంచ్ మునుగు కోటేశ్వరరావు మద్దతు తెలిపారు.

కొనసాగుతున్న వెటర్నరీ విద్యార్థుల ఆందోళన

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారమూ కొనసాగింది. ఏఐఎస్ఎఫ్‌జిల్లాసంఘ నాయకులతో విద్యార్థులు కలసి ఎస్వీయూ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌ని పరిష్కరించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పశువైద్యం ప్రాముఖ్యతని తెలియజేసేవిధంగా నాటికని ప్రదర్శించారు. , తమగోడుని పట్టించుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు.

శేష, భూత వాహనాలపై దర్శనం

చంద్రగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం శేషవాహనం, రాత్రి భూత వాహనంపై పార్వతీపరమేశ్వర్లు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు ఉత్సవర్లను శేష వాహనంలో అదిష్టించి ఆలయ ప్రదక్షణగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి భూత వాహనంపై అదిష్టించి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

చంద్రగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విభాగంలో క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సు శనివారం ముగిసింది. కంప్యూటర్ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులకు వివరించారు. వారిలో కంప్యూటర్ రంగంపై ఆసక్తిని, అవగాహనను కల్పించడమే సదస్సు ముఖ్య ఉద్దేశం. 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(న్యూఢిల్లీ) సహకారంతోవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ అవనిజ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



చంద్రగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాయలపురం వద్ద జాతీయ రహదారిలో శనివారం మూడేళ్ళ బాలుడు ఒంటరిగా నడుచుకొంటూ వెళ్ళుతుండగా స్థానికులు గమనించారు. బాలుడు వివరాలు స్థానికులు అడుగగా రాయచోటికి చెందిన ఖాజా అని, తండ్రి ఖలీమ్, తల్లి సుమియాగా చెప్పాడు. అనుమానం రావడంతో స్థానికులు బాలుడుని పోలీసులకు అప్పగించారు. వారు రాయచోటి పోలీసులకు సమాచారమిచ్చారు. సాయం త్రం మండలంలోని గొల్లవాని కావుల వద్ద మామిడి తోటలో కాపలాగా ఉన్న ఖలీమ్, సుమియాలకు ఈ బాలుడ్ని అప్పగించారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎర్రమిట్టలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై అలిపిరి పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు... రాయలవారి వీధి సమీపంలోని ఎర్రమిట్టలో కొంత కాలంగా ఇంటిని వ్యభిచార గృహంగా మార్చుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న లక్ష్మితో పాటు ఇద్దరు విటులను అరెస్టు చేశారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

బ్యాంకు రుణాలు, కాంట్రాక్టుల పంపకాలతో వర్గీకరణ కావాలి ● మాజీ ఎంపీ చింతా మోహన్



కుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. వర్గీకరణను వ్యక్తిగతంగా తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కుప్పంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతా మోహన్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పరిస్థితులు ఘోరంగా ఉన్నాయన్నారు. పేదలైన ఎస్సీలను విభజించి పాలించడం తప్పన్నారు. దేశ జనాభాలో కనీసం ఒక్కశాతం ఉన్న గుజరాతీ మార్వాడీలకు బ్యాంకు రుణాలు దోచి పెడుతున్నారని ప్రధాని మోదీని విమర్శించారు. జనాభాలో 25 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలు, 50 శాతం ఉన్న ఓబీసీలకు ఒకట్రెండు శాతాలతోనే రుణాలు లభిస్తున్నాయని.. పేదలుగానే ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో పెట్టే వేలకోట్ల రూపాయలను రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వ్యయం చేయాలని డిమాండ్ చేశారు.

గట్టిగా అంటే జైలుకు పోతావ్ జగన్

మిత్రుడు వైఎస్సార్ కొడుకు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి హయాంలోనూ, మళ్లీ తాను సీఎంగా ఉన్న సమయంలోనూ అడ్డదారుల్లో వేలకోట్లు సంపాదించి కుబేరుడు అయ్యాడని చింతామోహన్ విమర్శించారు. ఆయన అడిగిన ఒక్క ఛాన్సు అయిపోయిందని, ఇక ఇంటికి వెళ్లి బిడ్డలకు పెళ్లిళ్లు చేసి, సంపాదించిన ఆస్తులను కాపాడుకుంటూ కాలం గడపాలని సలహా ఇచ్చారు. పదుల సంఖ్యలో ఇరుక్కున్న జగన్, గట్టిగా అంటే జైలుకు పోతాడన్నారు. ఆయనకు ఇక రాజకీయాలు, సీఎం పదవి ఎందుకని ఎద్దేవా చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

భాకరాపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని తిరుపతి డీఎల్‌పీవో సురేశ్ నాయుడు అన్నారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీలో ఇంటింటా చెత్తసేకరణ ప్రత్యేక డ్రైవ్‌లో శనివారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ కిశోర్ కుమార్, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, సర్పంచ్ మనోహర, కార్యదర్శి గిరిబాబు, రామ్మోహన్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి: ఐతేపల్లెలో శనివారం ఇంటింటా చెత్త సేకరణ, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంపీటీసీ ఏసీ శేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, పంచాయతీ సిబ్బంది ఇంటింటా చెత్తను సేకరించారు. గ్రామస్తులకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తిరుచానూరు: గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా పంచాయతీసిబ్బందికి అందజేయాలని ఈవోపీఆర్డీ వెంకటరత్నం పిలుపునిచ్చారు. కాలువల్లో చెత్త వేయకూడదని ప్రజలకు సూచించారు. స్వర్ణ తిరుచానూరుగా తీర్చి దిద్దుకుందామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆనందాచారి, యశ్వంతి తదితరులు పాల్గొన్నారు.

సి.మల్లవరంలో భక్తులకు అన్నదానం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) కల్యాణ వేంకన్న గరుడోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సి.మల్లవరం పంచాయతీ పరిధిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు అన్నవితరణ చేసినట్లు సర్పంచ్ మొక్కల భారతి, తిమ్మారెడ్డి పేర్కొన్నారు.

కళాకారులకు పాత బకాయిలు ఇప్పించండి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): స్థానిక యూత్‌హాస్టల్‌లో ఏపీ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు. పలువురు కళాకారులు మాట్లాడుతూ..తమకు పాతబకాయిలు ఇప్పించాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఆర్ కృష్ణబాబు మాట్లాడుతూ.. కళాకారుల సమస్యలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, ప్రధానకార్యదర్శి కుమార్‌నాయక్, కోశాధికారి సరోజమ్మ, రెడ్డెప్ప, సత్తిరాజా పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాటం

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల ఇంటి స్థలాల సాధనకు కార్యకర్తలు,నాయకులు పోరాటం చేయాలని సీపీఐ నాయకులు పి.హరినాథరెడ్డి పలుపు నిచ్చారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయడానికి జాప్యం జరుగుతోందన్నారు. ఇందుకోసం ప్రజా పోరాటాలు చేయడానికి ముందుకు రా వాలన్నారు. జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు చిన్నిరాజ్,జిల్లా కార్యదర్శి పి.మురళి, శశికుమార్, బి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

మేం పనీపాట లేకుండా వస్తున్నామా?

● సమావేశాలకు రాని జిల్లా అధికారులపై జడ్పీ చైర్మన్, సభ్యుల ఆగ్రహం

● షోకాజ్ నోటీసులివ్వాలని తీర్మానం


అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుప్పం నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీ సభ్యులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మేము పనీపాట లేకుండా సమావేశాలకు వస్తున్నామా? జిల్లా అధికారులకు ఎందుకు రారు? వారికి బాధ్యత లేదా?' అంటూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు పలువురు గైర్హాజరయ్యారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల కింద స్థాయి అధికారులు సమాధానం చెప్పలేక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు సమావేశాలకు హాజరవుతున్నా.. వివిధ శాఖల జిల్లా అధికారులు రాకపోవడంపై మండిపడ్డారు. గైర్హాజరైన అధికారుందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జడ్పీ చైర్మన్ చెప్పగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలనీ నిర్ణయించారు.

కుప్పంలో టీచర్ల తీరుపై ఆందోళన

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల టీచర్ల తీరు ఆందోళన కలిగిస్తోందని కుప్పం జడ్పీటీసీ శరవణ అన్నారు. ఆయన మాటల్లోనే.. 'కుప్పం నియోజకవర్గంలో పనిచేసే సుమారు 100 మందికి పైగానే ప్రభుత్వ టీచర్లు బెంగళూరులో స్థిరపడ్డారు. రోజూ అక్కడినుంచి కుప్పానికి ట్రైన్ ద్వారా వస్తున్నారు. ఈ ట్రైన్ ఉదయం 8.30 గంటలకు కుప్పం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. ఏదైనా కారణంతో ఆలస్యమైతే తొమ్మిది గంటలు దాటుతుంది. పైగా ట్రైన్ దిగిన వెంటనే టిఫిన్లు తిని.. ఆపై స్కూళ్లకు చేరుకోవాలంటే మరో 45 నిమిషాలకంటే ఎక్కువ సమయమే పడుతుంది. అంటే బడులకు సుమారు 9.45గంటలకు చేరుకుంటున్నారు. సాయంత్రం కూడా స్కూల్ వదిలే సమయం 3.45 గంటలకైతే మధ్యాహ్నం 2.45 గంటలకే బయటకు వచ్చేస్తున్నారు. ఎందుకంటే కుప్పం నుంచి బెంగళూరుకు మధ్యాహ్నం 3.15 గంటలకు ప్యాసింజర్ రైలు ఉంది. ఈ రైలు ఎక్కాలంటే సుమారు అరగంట ముందు స్కూల్ నుంచి బయల్దేరాలి' అని వివరించారు. మరికొందరు ఉపాధ్యాయులైతే ఒకేచోట పదేళ్లకుపైగా పాతుకుపోయి రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేస్తూ పాఠశాలలకు వెళ్లడం లేదని, పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని డీఈవోను జడ్పీ చైర్మన్ ఆదేశించారు.

ఎంపీడీవోలు కనీస మర్యాద ఇవ్వడం లేదు

జిల్లాలో ఏ ఎంపీడీవో కూడా జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులకు కనీస మర్యాద ఇవ్వడం లేదని సభ్యులందరూ జడ్పీ చైర్మన్, సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. సమావేశాలకు పిలవడం మానేశారని చెప్పారు. అధికారుల తీరుపై సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తే ప్రభుత్వానికి, జడ్పీ చైర్మన్, సీఈవోకే అవమానమని ఊరుకుంటున్నామన్నారు. ఇక మండలాల్లో ఎమ్మెల్యేల గ్రాంటు ద్వారా పెద్ద పెద్ద పనులు చేస్తున్నారని.. బోర్ల మరమ్మతులు, ట్యాంకులు శుభ్రం చేయడం వంటి చిన్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎందుకు చేయడం లేదని ఎస్ఈని ప్రశ్నించారు. వేసవి మొదలైందని జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంతలను కూడా సరిగా పూడ్చరా?

'ఆర్అండ్‌బీ రోడ్లు చాలావరకు గుంతలుపడి ప్రమాదకరంగా మారాయి. కొత్త రోడ్లు వేయాలని కోరితే గుంతలు పూడ్చి చేతులు దులుకున్నారు' అని జడ్పీటీసీ సభ్యులు ఆరోపించారు. ప్యాచ్ వర్కులు కూడా సరిగా చేయక పోవడంతో జనం ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు ఇరువైపులా పిచ్చి చెట్లు పెరిగిపోయాయని, పట్టించుకోకపోతే ఎలా అని అధికారులను చైర్మన్ ప్రశ్నించారు. కుప్పం మండలం నుంచి తమిళనాడుకు కలప అక్రమంగా రవాణా సాగుతోందని సభ్యులు తెలిపారు. నరికేస్తున్న చెట్లలో ఎక్కువగా ఆర్అండ్‌బీకి చెందినవే ఉన్నాయన్నారు. శనివారం ఉదయం కూడా పీఈఎస్ కళాశాల ఎదుట రోడ్డుపై ఉన్న చెట్లను నరికేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని కుప్పం జడ్పీటీసీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేద, వైస్ చైర్మన్లు ధనంజయ్‌రెడ్డి, రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల పేరుతో భయపెడుతున్నారు


రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని ఇస్తున్న రైతులు

భాకరాపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల పేరుతో కొందరు భయపెడుతున్నారని కందుకూరివారిపల్లె గ్రామస్తులు శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానకీరామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శిగరాల చెరువు చెందిన కొందరు దళిత నాయకులు పొలాల పక్కన గల పొలాలను ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. గ్రామానికి చెందిన రైతులు ఇబ్బంది పడుతున్నారని, భూములకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో హస్తకళామేళా సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. చెన్నైకు చెందిన శంకర నాట్య విద్యాలయకు కళాకారులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. కళాకారులు క్షితిజాదిత్య, ప్రకృతి ఆదిత్య, రేణుకాశ్రీ, జోష్నా, సంజన, అక్షయ్య, అనన్య తదితరులు తిరుపుగల్, కోలాట్టం, సీతాకల్యాణం, కరాగం, గరుడగమనం, శ్రీచక్రరాజా, ప్రభోగణపతి అయిగిరినాధిని వంటి కీర్తనలకు భరత నాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


ప్రజల నుంచి అర్జీలుస్వీకరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. రఘునాథ్ రిసార్ట్సులోని పార్టీ కార్యాలయంలో ఆయనకు పలువురు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం అధికారులు చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అదనంగా దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి సోమన్న



తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీ సోమన్న శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు శాంతారామ్, నరేష్‌కుమార్‌తో కలిసి ఆయన ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. మంత్రికి ఆలయాధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద బారికేడింగ్


అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు బారికేడింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని రోజులుగా చెకింగ్ పాయింట్‌కు ముందుతో పాటు తనిఖీల అనంతరం కూడా వాహనాలు భారీగా నిలుస్తున్నాయి. దీంతో ఆ ప్రదేశమంతా గందరగోళంగా మారుతోంది. అలాగే తనిఖీల అనంతరం వాహనాలను ఇష్టమొచ్చినట్టు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా వెనుక వచ్చే వాహనాలకు కూడా ఇబ్బందిగా మారుతోంది. ఈ సమస్యను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఈ నెల 15వ తేదీ రాత్రి స్వయంగా గుర్తించారు. రద్దీని క్రమబద్ధీకరిం చేందుకు తనిఖీ కేంద్రం దాటిన తర్వాత కూడా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా శనివారం ఈ పనులు ప్రారంభమయ్యాయి.

కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై పుస్తకావిష్కరణ

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆకెళ్ల విభీషణశర్మ రచించిన కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనే పుస్తకాన్ని శనివారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆవిష్కరించారు. టీటీడీ పరిపాలన భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకంలో బ్రహ్మోత్సవాలలోని వాహనసేవల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సీతఈ సత్యనారాయణ, డీపీపీ కార్యదర్శి రామ్‌రఘునాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కవలల సంబరాలు



ప్రతిభ చూపిన కవలలకు బహుమతుల ప్రదానం

తిరుపతి, అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్‌రోడ్డులోని కొత్తపల్లి ఆనందరావు కళాక్షేత్రంలో శనివారం రాత్రి ప్రపంచ కవలల దినోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. స్థానికంగా 20మంది కవలలు ఒక వేదిక పైకి వచ్చి ఆటపాటలతో రంజింపచేశారు. జిల్లా కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కవలను ఆశీర్వదించి ఘనంగా సన్మానించారు. కె.ఎస్.రాజా, రాజశేఖర్‌రెడ్డి, కొత్తపల్లి శంకరావు, టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుబారా తగ్గించి ఆదాయ మార్గాలను వెతకాలి

● మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



యనమల రామకృష్ణుడు

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దాన్ని రికవరీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉంది. కోరికలైతే విపరీతంగా ఉన్నాయి. దానికి తగట్టు ఆదాయం కూడా లేదు. అప్పులు కూడా భారీగా పెరిగాయి. ఎవరి వల్ల పెరిగాయనేది చెప్పడం లేదు. అప్పులు తీర్చుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవాలి. ట్యాక్స్ రేట్స్ ఇప్పటికే 9 శాతం ఉన్నాయి. ఇంకా పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టే పరిస్థితి లేదు. దుబారా ఖర్చులను చాలా వరకు తగ్గించుకుంటూ ఆదాయ మార్గాలను వెతకాలి' అని రాష్ట్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ నిధుల కొరతతో రాష్ట్రం చాలా ఇబ్బంది పడుతోందన్నారు. ఈ కష్టాలు తొలగడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఐదారేళ్ల తర్వాత తిరుమలకు వచ్చానని, అప్పటికి ఇప్పటికి చాలా మార్పులు కనిపిస్తున్నాయన్నారు.

ఉద్యోగులకు క్రీడా సాంస్కృతిక పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఉద్యోగులకు ఆదివారం నుంచీ క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 25 వరకూ పోటీలు కొనసాగనున్నాయి. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటారు. ప్రారంభ కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ రామచంద్రరావు, డీన్ శ్రీనివాసరావు, రీసెర్చ్ డైరెక్టర్ సుమతి, పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ అతిధులుగా హాజరు కానున్నారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



కిరణ్‌కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఆక్వా కల్చర్ పరిశోధకులు బి. కిరణ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. కంపారిటివ్ స్టడీస్ ఆఫ్ ద ఎఫెక్ట్ ఆఫ్ ప్రొబయాటిక్స్ ఆన్ ద గ్రోత్ అండ్ వాటర్ క్వాలిటీ మెయింటెనెన్స్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఫిషెస్ పంగాసిస్ హపొథలమస్ అండ్ పియరక్టస్ బ్రొకైపోమస్ అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. పరిశోధనకు ప్రొఫెసర్ పి. నాగజ్యోతి పర్యవేక్షకులుగా వ్యవహరించారని సీతా దామ్లానాయక్ తెలిపారు.

శాశ్వత ఉద్యోగులుగా నియమించాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లేబూరి రత్నకుమార్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలేదన్నారు. వీరిని శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మధ్యవర్తి లేకుండా నేరుగా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మురళీధర్, షఫీవుల్లా, అనూష, బోదేషవల్లి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం సర్కిల్ వద్ద రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదంతో కాఫీ దుకాణంతో పాటు కారు అద్దాలు పగిలాయి. వెస్ట్ ఎస్‌ఐ అనిల్ కథనం మేరకు...స్థానిక లక్ష్మీపురం సర్కిల్‌లోని పెట్రోలు బంకులో బైరాగిపట్టెడకు చెందిన ముజామల్ పనిచేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని అలిపిరి వద్ద అరకు కాఫీ దుకాణం వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం మత్తులో ఉన్న తేజ రాయల్ చిన్న పాటి వివాదంతో ముజామల్‌పై దాడికి దిగాడు. వెంటనే బాధితుడు తన స్నేహితుడు వెంకీకి ఫోన్ చేసి ఘటనా స్థలానికి రమ్మన్నాడు. దీంతో ఇరు వర్గాలూ దాడి చేసుకున్నాయి. ఈక్రమంలో అక్కడున్న అరకు కాఫీ దుకాణం . కారు అద్దాలను ధ్వంసం చేశారు. ముజామల్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అనిల్, సిబ్బంది చేరుకుని ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.

ర్యాప్సోడి నిర్వహించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ర్యాప్సోడీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇంజనీరింగ్ విద్యార్థులు శనివారం వీసీని కోరారు. ఐఐటీలు, వివిధ యూనివర్సిటీలు నిర్వహిస్తున్న ఉత్సవాల తరహాలోనే చేపట్టాలని విన్నవించారు. మూడేళ్ళుగా ఇంజనీరింగ్ కాలేజీ వార్షికోత్సవం నిర్వహించకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామన్నారు. ర్యాప్సోడీలో సృజనాత్మకత, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ, వాస్తవ ప్రపంచిక అనుభవాన్ని పొందడడానికి అవకాశం కలుగుతుందన్నా విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ర్యాప్సోడీ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట-గురవరాజుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అదాలత్‌లో ఛైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, కె.రామ్మోహన్‌రావు, ఎస్.ఎల్.అంజనీకుమార్‌లు పాల్గొంటారన్నారు. వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేంకటపతినగర్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతీదేవి పూజని నిర్వహించి విద్యార్థులకు వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ..పాఠశాలకు సొంతభవనాన్ని ఏర్పాటు చేసుకునేవరకు లీజు గడువు పొడిగిస్తున్నామన్నారు. వీసీకి ప్రిన్సిపాల్ కె.రేష్మ కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా రావి, వేపచెట్లకు కల్యాణోత్సవం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ అగ్రహారం మెయిన్‌రోడ్డులోని వేప, రావిచెట్లకు శనివారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా స్థానిక సత్తమ్మ ఆలయం వద్ద ఉన్న ఈ చెట్లకు 15సంవత్సరాలుగా కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈఏడాది గ్రామానికి చెందిన పద్మావతమ్మ, ముత్యాలయ్య దంపతుల నేతృత్వంలో ప్రత్యేకపూజలు చేసి కల్యాణాన్ని జరిపారు. బీజేపీనాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, అర్చకులు సురేష్‌స్వామి, మునిరామయ్య, శివ, మునెమ్మ, వెంకటముని, చిన్న, సుబ్రమణ్యంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గతం మరచిపోయావా భూమనా?

డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ధ్వజం



తిరుపతి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి) : తిరుమల-తిరుపతిలో ఏదో జరిగిపోయిందని మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి గతం మరచి నీతులు మాట్లాడుతున్నారంటూ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 2007లో కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైనప్పుడు ఆయన కంటే ముందుగా బోర్డు సభ్యుడి చేత ప్రమాణ స్వీకారం చేయించినందుకు ఓ అధికారిని బదిలీ చేయించారన్నారు. తర్వాత మళ్లీ అతనే కీలక అధికారిగా వచ్చాక భూమన నేతృత్వంలోని పాలకమండలి వేధింపులు తాళలేక ఇద్దరు ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన నేతృత్వంలో టీటీడీ నిధులను కొల్లగొట్టారన్నారు. దర్శనాల పేరుతో కొండను లూటీ చేశారన్నారు. మేయరుకు తెలియకుండా కౌన్సిల్ అజెండాలో అంశాలను చేర్చిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటుంటే మేయర్‌ను దర్నాకు కూర్చోబెట్టారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక అనైతికమని మాట్లాడుతున్నారు. ప్రమాణస్వీకారం చేయకూడదని చెబుతున్నారు. కరోనా సమయంలో అభినయ్ పుట్టినరోజు సందర్భంగా కౌన్సిల్‌లో హంగామా చేసి ప్రమాణస్వీకారం చేయలేదా? అని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు సుబ్బుయాదవ్, శ్రీధర్, నాగప్రతాప్, సుధాకర్ రెడ్డి, దేవా, జగ్గా, రవితేజ నాయుడులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తలపై అవగాహన



డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో పోగవుతున్న తడి-పొడి చెత్తలను వేరు చేసి అందివ్వాలని గ్రామ సచివాలయాల యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలదేవి నేతృత్వంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ డబ్బాలను అందజేసి తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నింపాలని, ఆ తరువాత పారిశుధ్య కార్మికులకు అందివ్వాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా తమ సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. శెట్టిపల్లి గ్రామసచివాలయ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో సప్తగిరిలేఅవుట్, మిట్టగాంధీపురం, చెన్నాయగుంటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె.వీరమ్మ, ఉపసర్పంచ్ రామకృష్ణ, టీడీపీ లీడర్ మాతయ్య, బిల్‌కలెక్టర్ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. తిరుమలనగర్ మంగళం 2, సప్తగిరి కాలనీలలో క్యాంపెయిన్ నిర్వహించారు.

ఏపీ పీజీసెట్‌ను రద్దు చేయాలి



సంఘీభావం ప్రకటిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్‌ను రద్దు చేసి యూనివర్శిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి శనివారం ప్రెస్‌క్లబ్‌లో సంఘాల నాయకులు వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, కార్యదర్శి నజీర్ అహ్మద్ విధానాలతో పీజీ ప్రవేశాలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయన్నారు. 2021 నుంచి ఈ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పీజీ ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను గుర్తించి పీజీ ఉమ్మడి ప్రవేశపరీక్షలు నిర్వహించకుండా సంబంధిత వర్శిటీలకే నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్నారు. రద్దు చేయకపోతే యూనివర్శిటీల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బండి చలపతి, అక్బర్, చిన్న, మల్లికార్జున, ఆశ, తిరమలేష్, సుందర్, విజయ్, వినోద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ శ్రీధర్ సేవలు అనుసరణీయం



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన మహనీయుడు కేఎస్ శ్రీధర్ అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వి. దుర్గాప్రసాద్, జిల్లా జడ్జి సీఎం గురునాథ్ పేర్కొన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది కేఎస్ శ్రీధర్ వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా జిల్లా జడ్జి సీఎం గురునాథ్, అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ మేడసాని మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎస్ శ్రీధర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన కుమారుడు కేఎస్ వాసు రచించిన ది మాన్ విౌట్ మాజిక్ వాండ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. న్యాయవాద వృత్తిలో 50 ఏళ్ల అనుభవాన్ని పూర్తి చేసుకున్న దొరైరాజ్‌ను సన్మానించారు. కేఎస్ శ్రీధర్ సతీమణి సుమిత్ర, కేఎస్ వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పదవ ఏడీజే రామచంద్రుడు, రెండవ అదనపు మేజిస్ట్రేట్ కోటేశ్వర్‌రావు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు గల్లా సుదర్శన్, తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్, కేఎస్ శ్రీధర్ సోదరుడు గోపాలకృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ పరీక్షలు



తిరుపతి (ఆటోనగర్) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాస్ పొదుపు సంఘాల సంఘాల సభ్యులను క్యాన్సర్‌నుంచి కాపాడుకోవడానికి నిరంతరం కృషి చేస్తుందని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటరత్నం చెప్పారు. సంజయ్ గాంధీ కాలనీ రాస్ క్లష్టర్‌లో సోమవారం మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ రాస్ మహిళా పొదుపు సంఘాల మహిళలకు తరచూ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాధి వచ్చిన వెంటనే వైద్యుల సలహాలు మందులు తీసుకోడం, జాగ్రత్తలు పాటించడం వల్ల క్యాన్సర్ వ్యాధి నుంచి బయట పడే అవకాశాలు వంద శాతం ఉన్నాయన్నారు.

ఎంఆర్‌పల్లె స్కూల్లో ఆలోచన దినోత్సవం



పుస్తకం అందజేస్తున్న దృశ్యం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలోని జెడ్పీహైస్కూల్‌లో స్కౌట్ ఉద్యమ స్థాపకులు లార్డ్ స్టీఫెన్ స్మిత్ రాబర్ట్ బాడెన్ పవల్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆలోచనాదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్కౌట్స్ విద్యార్థుల విన్యాసాలు అలరించాయి. స్కౌట్స్ జిల్లా కమిషనర్ ఎంఎంరెడ్డి,ఎంఈవో భాస్కర్‌నాయక్, హెచ్‌ఎం ఆర్.వంశీరాజ్ తదితరులు మాట్లాడారు.

టీడీపీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. గ్రామంలో టపాకాయలు కాల్చడంతో ప్రమాదవశాత్తూ నిప్పు పడి దాదాపు రూ.లక్షకు పైగా విలువచేసే ఫర్నిచర్ దగ్ధమైందని పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సకాలంలో స్పందించడంతో విలువైన వస్తువులను కాపాడుకున్నామన్నారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్న కవలలు

కనులపండువగా కవలల వేడుక

ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగాశనివారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూలు హైదరాబాద్, గద్వాల్, బెంగళూరు నుంచి కవలలు హాజరయ్యారు. చిన్నారుల నుంచి పెద్ద వయసు వరకు ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు. భారీ కేక్‌కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ర్యాంపువాక్‌తో కొందరు ఆకట్టుకున్నారు. డ్యాన్సులతో హోరెత్తించారు. వినసొంపైన గాత్రకచేరీలతో మైమరపించారు. ఆ క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి, ప్రాతినిథ్యం వహించిన బహుమతులు ప్రదానం చేశారు. 80 కవల జంటలు కనువిందు చేశారు. సీయూ నెక్స్ ఇయర్ అంటూ బరువైన హృదయంతో ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



చిన్నారి సాహస విన్యాసం

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 23 కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలతో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.52 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,327

తలనీలాలు సమర్పించినవారు : 22,804



పల్లికొండేశ్వరాలయం



పరమశివుని అరుదైన దివ్య రూప సందర్శనం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వీక్షించవచ్చు. శంకరుడు అన్నీ ఆలయాల్లోనూ లింగాకార రూపంలోనే దర్శనమిస్తాడు. ఇక్కడ మాత్రం పార్వతీ ఒడిలో 14 అడుగుల మానుష రూపంలో శివశయనమూర్తిగా అనుగ్రహమిస్తాడు. పార్వతీ సమేతంగా యోగనిద్రలో దర్శనమిచ్చే ఈ పరమేశ్వరుడుని దర్శించుకుంటే తమ కోరికలు శీఘ్రంగా నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వశిస్తారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి

యోగ నిద్రామూర్తి

సురుటుపల్లి పల్లికొండేశ్వరుడు

స్థల పురాణం

ఆలయానికి సంబంధించి స్థల పురాణం ఇలా ఉంది. దేవతలె అమృతంకోసం క్షీర సాగర మదనం చేసినప్పుడు పాల సముద్రం నుంచి కాలకూట విషం వెలువడుతుంది. లోక కళ్యాణార్థం శివుడు దానిని స్వీకరిస్తాడు. విషాన్ని గర్భంలోకి చేరకుండా పార్వతీ దేవి తమ పతి గొంతును నొక్కి పడుతుంది. దీంతో గొంతు భాగం నీలి రంగుగా మారుతుంది. అందుకే శివుడ్ని నీలకంఠుడంటారు. విష ప్రభావానికి లోనైన స్వామి భరించలేని తాపంతో పార్వతి ఒడిలో సేదదీరాడు. శివశయన మూర్తికి ఏర్పడిన స్థితికి చింతిస్తూ సకల దేవతలు వచ్చారు. ఆ రోజు త్రయోదశి మంగళవారం సాయంకాలం ప్రదోష వేళలో మహాదేవుడు విషాహరణ దుస్థితిని వీడాడు. తన కమల నేత్రములను వికసింపజేసి గౌరీ సమేతంగా భక్తులకు అనుగ్రహించాడు. అందుకే క్షేత్రంలో ఆమె పేరు సర్వమంగళా దేవి. సురుటుపల్లి పల్లికొండేశ్వర క్షేత్రం ప్రదోష క్షేత్రంగా వాసికెక్కింది.



వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు...

ఆలయంలో ఏటా 10రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దేవదాయశాఖ నిధులతో పాలకమండలి చైర్మన్, ఆలయ ఈవో నేతృత్వంలో చలువపందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు, తాగునీటి వసతులు, పుష్పాలంకరణ వంటివి ఏర్పాటు చేస్తారు. పల్లకి ఉత్సవం, చంద్రప్రభా వాహనం, కామధేను వాహనం, భూతవాహనం, అధికార నంది వాహనం, గజవాహనం, అశ్వవాహనం, వృషభ వాహనం, కల్ప వృక్ష వాహనం, రావణాసుర వాహనాల్లో స్వామి అమ్మవారికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈనెల 26నమహాశివరాత్రి పూజలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. అలాగే 15 రోజలకోసారి ప్రదోష వేళలో ప్రదోష మహానందికి అభిషేకాది పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు.

పేరిలా వచ్చింది..

విష్ణు బ్రహ్మాది సురులు వచ్చినందున సురులపల్లిగా పిలిచేవారు. కాలక్రమేనా సురుటుపల్లిగా మారింది. విజయనగరాధీశుడు హరి హర బుక్క రాయులు క్రీ.శ. 1344-47 లో పల్లికొండేశ్వరుడు నిర్మించారు. పార్వతీ పరమేశ్వరులు ప్రదోష వేళలో సర్వలోకాలను అనుగ్రహించడం వలన ఈదేవాలయం మహాప్రదోష క్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.




పరీక్షా కాలం... ఆరోగ్యం ప్రధానం

- మంచి ఆహారం... నిద్ర తప్పనిసరి
- జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడింది. ఇంటర్‌మీడియట్, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. దీంతో రాత్రి, పగలు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రేయింబవళ్లు చదువుకే కేటాయిస్తున్నారు. సమయానికి ఆహారం, చాలినంత నిద్ర గురించి పట్టించుకోకుండా బిజీ అయిపోతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ప్రధానమని విద్యా నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రతతో చదువు సాగించగలమని సూచిస్తున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



సాత్వికాహారం ఎంతో మేలు

చదివినవి బాగా గుర్తుండాలన్నా, ఏకాగ్రతగా చదవాలన్నా త్వరగా జీర్ణమయ్యే సాత్విక ఆహారం ఎంతో మంచిదని నిపుణులు చెబుతురు. సాత్వికాహారంలోనూ పరిశుభ్రత, సమతుల పోషక విలువలు ఉండేలా చూడాలి. నిర్దేశిత సమయమూ పాటించాలి. మసాలా ఆహారం దరిచేరనివ్వకూడదు. వీధుల్లో విక్రయించే ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని రోజుకు నాలుగు లీటర్ల వరకు తీసుకోవాలి. అన్నం లేదా బార్లీ గంజిని సాయంత్రం వేళల్లో తీసుకోవడం మంచిది. విద్యార్థులు రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. శీతల పానీయాలు తాగకూడదు. రోజుకు అరగంటైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.



పరిశుభ్రతతో ఉత్సాహం

శరీర, పరిసరాల పరిశుభ్రత ఉత్సాహాన్నిస్తుంది. చదువులో నిమగ్నమై స్నానం నిర్లక్ష్యం చేయకూడదు. శరీరం శుభ్రంగా ఉన్నపుడు మంచి మూడ్‌తో... చదివినది మెదడులో నిక్షిప్తమవుతుంది. అలసట వస్తే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. రెండు పూటలా స్నానం చేయాలి. లేదంటే చర్మం పొడిబారి చర్మవ్యాధులు వస్తాయి. దీనివల్ల ఏకాగ్రతకు భంగం కలుగుతుంది.



నిద్రతో ఉపశమనం

అలసిన శరీరానికి నిద్ర ఉపశమనం కలిగిస్తుంది. చాలినంత నిద్ర మరో రోజుపాటు చదువుకోడానికి కావలసిన ఉత్సాహాన్నిస్తుంది. చాలినంత నిద్ర లేకుండా చదవడం అనారోగ్యానికి దారితీస్తుంది... ఏకాగ్రత లేకుండా చేస్తుంది. అందువల్ల రోజూ 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. ఎక్కువసేపు మేల్కొని చదివేందుకు కాఫీ, టీలు అతిగా తీసుకోవడం మంచిది కాదు. సోయాబీన్ పిండి కలిపిన మజ్జిగ తాగితే మంచి శక్తిని ఇవ్వడంతోపాటు పగటి నిద్రను నిరోధిస్తుంది. రాత్రి 10 గంటలసయంలో పాలు తాగితే ఆరోగ్యంతోపాటు నిద్రకూ ఉపకరిస్తుంది.

ఆహార నియమావళి



విద్యార్థులు ఇప్పటినుంచే ఆహార నియమావళి అలవరచుకోవాలి. మూడు పూటలా ఆహారం తీసుకోవాలి. ఏపూటా ఆహారాన్ని స్కిప్ చేయకూడదు. సమతుల ఆహారం తీసుకోవాలి. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్, విటమిన్ బి, జింక్ జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి. రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కోడిగుడ్లు, పండ్లు, పిస్తా, ఆల్మండ్ తదితర నట్స్ ఉండేలా చూసుకోవాలి. పరిమితి మేరకు డార్క్ చాక్లెట్స్ తీసుకోవచ్చు... ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ మెదడును ఉత్తేజితంగా ఉంచుతాయి. బార్లీ జావ మేలు చేస్తుంది.

- కేవీఆర్వీ ప్రసాద్‌రావు, డైటీషియన్, రుయా ఆసుపత్రి, తిరుపతి.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 24నుంచీ నిర్వహించవలసిన దూరవిద్యా పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 24 నుంచీ మార్చి 15 వరకూ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు విధులు కేటాయించారు. చాలా మంది ఉద్యోగులు దూరవిద్యా పరీక్షలకు హాజరు కావలసి ఉంది. దీంతో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ తవమణి తెలిపారు.

సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం ఉత్తమ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన పట్టణ, గ్రామీణ క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- **బాలురు(15నుంచి 18 సంవత్సరాల వరకు):**ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్
- **బాలికలు(18నుంచి 24 సంవత్సరాల వరకు) :** టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

బాలికపై అత్యాచారం

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం గాజులమండ్యం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీ పరిధిలో నివాసముంటున్న పవన్(35) శనివారం ఉదయం ఓ 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడికట్టాడు. కూలి పనులకు వెళ్లొచ్చిన తల్లికి బాలిక ఈ విషయాన్ని తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం : డీపీవో

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22(ఆంధ్యజ్యోతి): జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లో ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నామని, తడి చెత్త-పొడిచెత్తపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా గ్రామపంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. శనివారం జిల్లాలో తడిచెత్త-పొడిచెత్త వేరు చేయడంపై అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీపీవో పలు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన తడిచెత్త, పొడిచెత్త ద్వారా చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. గడచిన నాలుగు నెలల్లో వర్మీకంపోస్టు విక్రయం ద్వారా పంచాయతీలకు రూ.7.20లక్షల ఆదాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



తడిచెత్త-పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న సుశీలాదేవి

రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి



మృతిచెందిన సౌందర్‌రాజన్

చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని కాశిపెంట్ల హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం మారేడుపల్లెకు చెందిన సౌందర్‌రాజన్(43), చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన అశోక్ హెరిటేజ్ ఫ్యాక్టరీలో పాల ట్యాంకర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో అశోక్ ఫ్యాక్టరీలో పాల లోడ్డును దింపేసి, ఫ్యాక్టరీ బయట ట్యాంకర్‌ను పార్క్ చేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సౌందర్‌రాజన్ తన ట్యాంకర్‌ను పార్కింగ్‌లో పెట్టి, దిగుతున్న క్రమంలో ట్యాంకర్ ముందుకు కదిలింది. దీంతో రెండు ట్యాంకర్ల మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు గుర్తించి, చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): త్యాగరాజనగర్‌లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ.20 లక్షల ఆస్తి బుగ్గిపాలైంది. బాధితుల కథనం మేరకు... శ్రీనివాసతేజ రెసిడెన్సీలో ఐదవ అంతస్తులో రామమోహన్‌రావు కుటుంబం ఉంటోంది. శనివారం తెల్లవారుజామున బెడ్‌రూము ఏసీలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు రావడం ఆయన గమనించారు. అప్రమత్తమై వెంటనే కుటుంబ సభ్యులను బయటకు పంపారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే ఆ శాఖ సిబ్బంది సకాలంలో చేరుకోలేదు. దీంతో మంటలు ఎగసి సామగ్రి కాస్తా అగ్నికి ఆహుతయింది. అగ్నిమాపక యంత్రం వచ్చే సరికి నష్టం జరిగిపోయింది. దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని యజమాని తెలిపారు. ఈ ఘటనలో పక్క ఫ్లాట్‌వారికి కూడా కొంతనష్టం వాటిల్లింది.

చెత్త పన్ను నుంచి విముక్తి

- పురపాలక, పట్టణాబివృద్ధి శాఖ నోటిఫికేషన్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన చెత్త పన్ను నుంచి ప్రజలకు విముక్తి లభించింది. గతేడాది డిసెంబరు 31 నుంచి చెత్త పన్ను రద్దు అమల్లోకి వచ్చినట్లుగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో సుమారు రూ.1.10 కోట్ల చెత్త పన్నును వైసీపీ అప్పట్లో వసూలు చేసిన విషయం తెలిసిందే. చెత్త పన్ను వసూళ్లను నిలిపివేస్తూ 2024 డిసెంబరులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మున్సిపల్ చట్ట సవరణను అసెంబ్లీ ఆమోదించింది. దానికి గవర్నర్ అనుమతితో ఇటీవలే గెజిట్ విడుదలైంది. తాజాగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది.వైసీపీ ప్రభుత్వం 2021 నవంబరులో ఈ చెత్త పన్ను ను అమలులోకి తెచ్చింది.2022 జూలై నుంచి మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు.చిత్తూరులోని 11 డివిజన్లలో రూ.70 లక్షల చెత్త పన్ను వసూలు చేశారు. పుంగనూరు నుంచి రూ.21 లక్షలు, పలమనేరులో రూ.12 లక్షలు, నగరి మున్సిపాలిటీ నుంచి రూ.8 లక్షల్ని వసూలు చేశారు. మొత్తంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల ప్రజల ముక్కు పిండి మరీ రూ.1.10 కోట్లను వసూలు చేయగలిగారు.మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే మిగిలిన డివిజన్లలో కూడా పన్ను వసూలు చేసేది. కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంతో పట్టణ ప్రజలకు పన్ను విషయంలో ఊరట లభించింది.



మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

భవితలో పిల్లల భవిష్యత్తు మారాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తును ప్రగతిపథం దిశగా నడిపించాలని డీఈవో కేవీఎన్ కుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఐఈఆర్‌టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో పిల్లల నమోదును పెంచాలన్నారు. వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లందరికీ భవిత కేంద్రాల ద్వారా అవసరమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంవో శివశంకరయ్య, ఏఏఎంవో మధు, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్



ప్లాంట్ కోసం కేటాయించిన స్థలం

- 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైన పనులు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిడెట్) బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. రూ.12.85 కోట్లతో ఐఓసీఎల్, టీటీడీ సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా తిరుమలలో రోజూ తడి చెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాంకు సమీపంలో ఉన్న డంప్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. ఇలా వచ్చిన చెత్త ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నులు ఉండటం గమనార్హం. దీని తొలగింపు కోసం టీటీడీ ఇప్పటికే చర్యలు చేపట్టింది. కాగా, తడి చెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే అంశంపై టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే తిరుమలలోని కాకులమానుతిప్ప వద్ద ఐఓసీఎల్ ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ఏర్పాటు కోసం 2.22 ఎకరాలు, కంపోస్టు నిల్వ కోసం 0.17 ఎకరాల స్థలాన్ని టీటీడీ ఇప్పటికే కేటాయించింది.

రూ.12.85 కోట్లు కేటాయింపు

ఈ ప్లాంటు నిర్మాణానికి రూ.12.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్లను టీటీడీ సమకూర్చనుంది. ఇప్పటికే ఐఓసీఎల్ ద్వారా బెంగళూరుకు చెందిన జీపీఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. తడి చెత్త ద్వారా వచ్చే ఆహారం, అరటి ఆకులు, చెట్లవేళ్ల వంటి మిక్స్‌డ్ వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారు చేసి, రెండున్నర కిలోమీటర్ల దూరంలోని తరిగొండ అన్నప్రసాద కేంద్రానికి పైపులైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు వేల కేజీల గ్యాస్‌ను వినియోగిస్తోంది. ఈ ప్లాంట్ ద్వారా తడిచెత్తను సమర్థవంతంగా తొలగించడంతోపాటు గ్యాస్ అవసరాలు కొంతలో కొంతైన తగ్గుతాయని టీటీడీ భావిస్తోంది. కాగా, ప్రస్తుతం ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలంలో చదును పనులు పూర్తయ్యాయి.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: పాశం



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలకు అధికారులు సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధశాఖల అధికారుల సమక్షంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారంలో ఒక రోజు ప్రజావేదిక నిర్వహించి అధికారుల సమక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామని చెప్పారు. అనారోగ్య కారణంగా దీర్ఘకాలికంగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను తనకు అందజేస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు సంబంధించిన వాహనాలు నిబంధనలను అతిక్రమించి నడిపితే చర్యలు చేపడుతామని డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. శనివారం స్థానిక సాధుపేట సెంటర్‌లో పోలీస్, ఆర్టీవో అధికారులు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బస్సులకు ఎప్పటికప్పుడు ఫిట్‌మెంట్ పరీక్షలు నిర్వహించుకుని కండీషన్‌లో ఉండేలా యాజమాన్యం చూసుకోవాలన్నారు. శిక్షణ పొందిన డ్రైవర్లనే నియమించుకోవాలని, విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి రావు, ఏఎంవీఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పనులను అడ్డుకుంటే కేసులు: డీఎస్పీ



అరిమేనిపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

ఓజిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్వారీకి అనుమతులు ఇచ్చేశారు... ఇప్పుడు ఆపాలంటే ఎలా... గ్రామాన్ని కాపాడుకోవాలంటే అనుమతులు రాకుండా ముందుగానే చూసుకోవాలి... ఇప్పుడు అడ్డుకోవడం అక్రమం... కేసుల దాకా తెచ్చుకోవద్దు... అని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అరిమేనిపాడు గ్రామస్తులను హెచ్చరించారు. శనివారం ఓజిలి మండలం అరిమేనిపాడు గ్రామస్తులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఇక్కడ క్వారీ వద్దేవద్దంటూ గ్రామస్తులు తమ అభ్యంతరాలను డీఎస్పీకి తెలిపారు. గతంలో అభిప్రాయ సేకరణ సందర్భంగా గ్రామానికి సంబంధంలేని వ్యక్తులతో క్వారీ ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరం లేదనే ధ్రువపత్రాలను సృష్టించడం, వివిధ స్థాయిలో అధికారులు అవకతవకలకు పాల్పడిన విషయాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్వారీ నిర్వాహకులకు అనుమతులు ఉన్నాయని, అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తడ, భీములవారిపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి సీఎస్‌సీ డాట్ ఎపి డాట్‌జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, వివరాలకు 9948146677 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ అన్నారు.

రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

కోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు రైతు సేవా కేంద్రాల్లో శనివారం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన రైతులకే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీల తదితర పథకాలు అందుతాయన్నారు. ఈనెల 25వ తేదీలోగా రైతు కేంద్రాల్లో విశిష్ట సంఖ్య కోసం వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.



మాచవరం, ముమ్మాయపాళెం, కోనేటిరాజుపాళెం సమీపంలో రోడ్ల దుస్థితి

భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమవుతున్న గ్రామీణ రోడ్లు

ఓజిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ఛిద్రమైపోతు న్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు రూపు కోల్పోయి అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో క్వారీల నుంచి నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు గ్రావెల్, మెటల్ తరలింపు గ్రామీణ రోడ్ల మీదుగానే సాగుతోంది. కేవలం తేలికపాటి వాహనాలు, బస్సుల కోసం వేసిన రోడ్లలో సామర్థ్యానికి మించి బరువుతో వెళుతున్న భారీ వాహనాలతో రోడ్లు రూపుకోల్పోతున్నాయి. మండంలోని అరిమేనిపాడు రెవెన్యూ పరిధిలోని రజానగరం నుంచి నాయుడుపేట మండలం కోనేటిరాజుపాళెం వరకు ఉన్న పది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా రూపు కోల్పోయింది. రజానగరం నుంచి తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయపాళెం గ్రామాల వద్ద అడుగడుగున గోతులు తేలాయి. ముమ్మాయపాళెం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కోనేటిరాజుపాళెం రోడ్డు కూడా ఛిద్రమైపోయింది. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్న కారణంగా రోడ్లు ఇలా మారాయి. రజానగరం నుంచి కోనేటిరాజుపాళెం వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో ద్విచక్రవాహన చోదకులతో పాటు కార్లు, ఆటోలు తిరగాలంటే హడలిపోతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురౌతున్నారు. ఆటోల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు: విజయశ్రీ



సమావేశంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన హెచ్‌డీసీ కమిటీ సభ్యులు సతీష్, సరిత, హనుమంతరావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని హెచ్‌డీఎస్ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ప్రస్తుతం రూ.5 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో విద్యుత్ మరమ్మతులు, ఎక్స్‌రే ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావ డానికి ఖర్చు చేస్తామన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రమైన సూళ్లూరుపేటలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నారని, అందులో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌డీసీ కమిటీ మెంబర్లు వై.సతీష్, హనుమంతరావు, సరిత, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉగ్గుముడి సర్పంచు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటపోలూరు సర్పంచు అరుణమ్మ, వేదికపై ఎంపీపీ అనిల్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం పనిచేయాలని ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సర్పంచులు గ్రామాల్లో సమస్యలపై గళం విప్పారు. కోటపోలూరు సర్పంచు కమతం అరుణమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి సమాచారం ఇవ్వడం లేదని, అభివృద్ధి పనుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ స్పందిస్తూ గ్రామ ప్రథమ పౌరురాలైన సర్పంచికి సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు గురించి సర్పంచులు, ఎంపీటీసీలకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతుందన్నారు. తీరప్రాంత గ్రామాలైన కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, దీనివల్ల తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో వుంచుకొని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఆయా పంచాతీయల్లో సర్పంచుల ద్వారా ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, డీటీ సంధ్య, విద్యుత్‌శాఖ ఏఈ పూర్ణిమ, ఏపీఎం ప్రసన్న, ఏపీవో నాగరాజు, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో 24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆహ్వాన ప్రతులను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, చెన్నం శ్రీనివాసులు, ఎన్.రాము, పి.రాజశేఖర్, ఎం.శాంతి, చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషోర్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - నెల్లూరు మెమూ రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - సూళ్లూరుపేట - నెల్లూరు మెమూ రైళ్లను ఈ నెల 24, 27, మార్చి 1వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్‌లోని పెదపరియ - నాయుడుపైట మధ్య రైలు మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా కొన్ని మెమూ రైళ్లు రద్దు చేశారు. ఆ ప్రకారం, మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లురుపేటకు ఉదయం 5.40, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 గంటలకు వెళ్లే మెమూ రైళ్లను రద్దు చేశారు. అలాగే, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20, సూళ్లూర్‌పేట నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35 గంటలకు వెళ్లే మెమూ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే వార్డుబాట

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే వార్డుబాట కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్, చినసత్రంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. తాగునీరు సక్రమంగా రావడం లేదని, సాయినగర్ నుంచి చిన్నసత్రం ప్రధాన రహదారి సరిగా లేదని స్థానికులు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు సిమెంటు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు, చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి, పాముూరు మునస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం మండలంలోని తిక్కవరం ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పీపుల్ వెల్ఫేర్ అండర్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల ద్వారానే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పోతుగుంట మల్లికార్జునరావు, హెచ్‌ఎం సునీల్‌కుమార్, చిల్లకూరు అరుణ్‌బాబు, యేసుదాసు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు అవకాశాల పరిశీలన

తడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తడ నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డును నాలుగు లేన్‌ల రహదారిగా మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తుడా సీపీవో దేవీకుమారి తెలిపారు. శనివారం తడకు వచ్చిన ఆమె శ్రీకాళహస్తి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ తడ నుంచి వరదయపాళెం మండలం కడూరు క్రాస్ రోడ్డు వరకు రోడ్డును విస్తరించేందుకు వీలుందన్నారు. తుది అంచనాలు రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తే చర్యలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో హోలి క్రాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను పార్కింగ్ చేసే చర్యలు తీసుకుంటామని సీఐ మురళీకృష్ణ అన్నారు. హోలి క్రాస్ ప్రధాన కూడలి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో వుంచుకొని, కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. నిబంధనలను పాటించకపోతే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేతలు



చిట్టమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శనివారం నెల్లూరులో చిట్టమూరు మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కార్యనిర్వాహణ కమిటీ సభ్యుడు బసవనూరు భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన మంత్రిని కలిసి చిట్టమూరు మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పుత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ జాతి ఉనికిని సంస్కృతీ సాంప్రదాయాలను మాతృభాష తర్వాతి తరాలకు అందిస్తుందని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు తీర్మానాలను ప్రతిపాదించారు. బోధనా భాషగా, పాలనా భాషగా తెలుగును అమలు చేయాలని, నామఫలకాలను తెలుగులో అవసరమైతే ఆంగ్ల భాషలో కూడా రాసుకోవచ్చని, డిగ్రీలో తెలుగును నాలుగో సెమిస్టర్ వరకు కొనసాగించాలని, బోధనలో తెలుగు మాధ్యమాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని తీర్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, తెలుగుపాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు వెంకటేశన్, మన్యం నరసింహులు, సుజన పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీల అభివృద్ధి



వడమాలపేటలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీవో సుశీలా దేవి

వడమాలపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్ర జ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయితీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయితీ అధికారి సుశీలాదేవి చెప్పారు. శనివారం వడమాలపేటలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తడి,పొడి చెత్త ద్వారా వర్మీకంపోస్ట్ తయారు చేసే అవకాశం ఉందని చెప్పారు. దీనిద్వారా పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రితేష్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, ఈవో పీఆర్డీ దయాసాగర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్‌తో అవస్థలు

- రైల్వే గేట్ లాక్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



పాతబోర్డు



రూ. 45 లక్షలతో స్టేషన్ మాస్టర్ గదిలో ఏర్పాటు చేసిన కొత్త కంప్యూటర్ సిస్టమ్ బోర్డు

పుత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ కొత్తగా చేపట్టిన ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్ వల్ల గేట్ల వద్ద సమస్యలు ఎక్కువై పోయాయి. అబ్సల్యూట్ బ్లాక్ సిస్టమ్ స్థానంలో 45లక్షల రూపాయలతో ఆధునీకీకరించిన ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్‌ను రైల్వే శాఖ వాడుతోంది. దీని పనులు పుత్తూరు స్టేషన్ వరకు పూర్తి చేశారు. మరో రెండు నెలల్లో తడుకు, పూడి స్టేషన్ల మధ్య పూర్తి చేసి రేణిగుంట స్టేషన్‌కు కలిపేయనున్నారు. పాత పద్ధతిలో ఓ రైలు పుత్తూరు స్టేషన్ వదిలిన తర్వాత వెనుక వున్న వేపగుంట స్టేషన్ నుంచి మరో రైలును స్టేషన్ మాస్టర్ల మధ్య సమాచార మార్పిడితో వదలాల్సి వుంది. ఈ సమయంలో మధ్యలో వున్న గేట్లను మూసి తెరవాల్సి వుంది. కొత్త సిస్టమ్‌లో ఇరు స్టేషన్ల మధ్య ప్రతి కిలో మీటరుకు ఓ సిగ్నల్‌ను ఏర్పాటు చేయడంతో స్టేషన్ మాస్టర్ల సమాచార మార్పిడితో పనిలేకుండా సిగ్నల్స్ ఆధారంగా రైళ్లు పరుగులు తీస్తుంటాయి. అంటే రెండు స్టేషన్ల మధ్య ఒకే పట్టా మీద ఒక దిశలోనే గతంలో ఓ రైలు నడిచే స్థానంలో నేడు నాలుగు రైళ్లు వరుసగా పరుగులు తీస్తుంటాయి. దీంతో ఇంటర్‌లాక్ సిస్టమ్ వున్న గేట్లను తెరిచేందుకు వీలు పడడం లేదు. ఫలితంగా రెండు స్టేషన్ల మధ్య రైలు లేని సందర్భంలోనే గేటును తెరవాల్సి వస్తోంది. ప్రస్తుతం పుత్తూరు పట్టణంలోకి వచ్చి చెన్నైకి, సత్యవేడుకు వెళ్లాలంటే విధిగా నారాయణవనం రైల్వే గేటును దాటుకుని వెళ్లాల్సి వుంది. ఉదయం సాయంత్రంచెన్నై-రేణిగుంట మధ్య రైళ్ల రాకపోకలు ఎక్కువగా వున్నాయి. దీంతో గతంలో పది నిమిషాలలో మూసి తెరిచే గేట్లకు నేడు దాదాపు 45 నిమిషాలు వ్యవధి పడుతోంది. ఫలితంగా వందల వాహనాలు గేటుకు ఇరుపక్కల బారులు తీరుతున్నాయి. ఈ గేటును దాటుకుని జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు, పీజీ హాస్టళ్లు, కొత్తగా ఏర్పడిన కాలనీలు వున్నాయి.దీంతో వాహనదారులతో పాటు సాధారణ జనం కూడా ఇబ్బంది పడుతున్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి

కొత్త ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్ రాకతో అప్పటిదాకా సిబ్బందితో నిర్వహిస్తున్న గేట్లను రైల్వేశాఖ పూర్తిగా మూసేసింది. ప్రత్యామ్నాయంగా ఆ గేటు వద్ద అండర్ బ్రిడ్జి లేక ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి చాలా వరకు పూర్తి చేసింది. అయితే పుత్తూరు పట్టణంలో వున్న నారాయణవనం గేటు, మరాఠీ గేట్ల విషయంలో ఈ ఏర్పాటు జరగలేదు. నారాయణవనం గేటుసమస్యకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఫైలు దుమ్ము దులపాల్సి వుంది. నిర్మాణం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖలు సమానంగా భరించాల్సి వుంది.రాష్ట్ర ప్రభుత్వం నిధుల మంజూరుకు అనుమతి ఇస్తే పనులు ప్రారంభం అవుతాయి.పట్టణంలో ఉత్తర దిక్కున వున్న ఫ్లైఓవర్‌కు గతంలో మాజీ మంత్రి ముద్దుకృష్ణమనాయుడు కృషి చేస్తే నేడు దక్షిణ దిక్కులో వున్న నారాయణవనం గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఆయన కొడుకు, శాసన సభ్యుడు గాలి భానుప్రకాష్‌కు కృషి చేయాల్సి వుంది.

గేటు సమస్యకు తక్షణ పరిష్కారంగా....

ఫ్లై ఓవర్ నిర్మాణం దీర్ఘకాలం జరిగే అవకాశం వున్నందున తక్షణ పరిష్కారంగా స్థానిక రైల్వే అధికారులు ఉన్నతాధికారులకు ఓ సూచనను పంపారు. రైల్వే గేటుకు ముందున్న సిగ్నల్ వద్ద రైలు వున్నప్పుడు గతంలో లాగా గేటును తెరిచేందుకు స్టేషన్ మాస్టర్‌కు అధికారం అప్పగించాలని కోరారు.ఇది జరిగితేనే తాత్కాలికంగా వాహనదారులకు ఉపశమనం కలుగుతుంది.

ఘనంగా వరల్డ్ స్కౌట్స్‌డే ర్యాలీ



పుత్తూరులో విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తున్న స్కౌట్ మాస్టర్

పుత్తూరుటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామరాజు నగర్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బేడెన్ పోవెల్ జయంతి సందర్భంగా డిస్ట్రిక్ ఆర్గనైజ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 22న ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ స్కౌట్స్‌డే జరుపుకుంటున్నారు. ప్రత్యేక అవగాహన కల్పించి, ఉత్తమ సేవలందించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ రాధిక, రోవర్ లీడర్ జయకుమార్, గైడ్స్ లీడర్ యువశ్రీ, జోత్స్న, చార్మి, భాను స్కౌట్ మాస్టర్ అశోక్‌కుమార్, గజరాజన్, గొల్లపల్లి, రాచపాళెం, గేటు పుత్తూరు, పుత్తూరు బాలికల ప్రభుత్వ హైస్కూలు స్కౌట్స్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వడమాలపేటలో...

వడమాలపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ ప్రారంభకులు రాబర్ట్ స్టీఫెన్ బాడెన్ పావెల్ జన్మదినం రోజున జరుపుకునే వరల్డ్ థింకింగ్ డేను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శనివారం స్కౌట్ ప్రార్థన, జెండా గీతం ఆలపించారు. తర్వాత ర్యాలీ నిర్వహించి వడమాలపేట బస్టాండు కూడలి వద్ద స్కౌట్ ప్రామిస్ చేశారు. పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రదర్శించారు. బాలబాలికలు స్కౌట్స్, గైడ్స్ పాల్గొని నీతి నిజాయితీ, క్రమశిక్షణతో మెలగాలని ఉపాధ్యాయులు సూచించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు అందించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం


ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 189, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,084మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,860మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,366మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,013, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 572మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 23,296 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మంత్రి వెంకటేష్‌కు స్వాగతం


మంత్రి పెందుర్తి వెంకటేష్‌ను సన్మానిస్తున్న గుడ్లూరు మల్లికార్జున నాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో శనివారం మంత్రి పెందుర్తి వెంకటేష్ ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేశారు. అందులో భాగంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ మయూర్ మంత్రిని తమ ఇంటికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను, పోలీసు బందోబస్తును డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరి నాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, సీఐ జయచంద్ర, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూసీ ప్లాంట్‌ను పరిశీలించిన డీపీవో

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మేజర్ పంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూసీ ప్లాంట్‌ను జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పరిశీలించారు. శనివారంజిల్లా వ్యాప్తంగా ఇంటి నుంచి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా.. ఇందులో భాగంగా స్థానిక సీబీఐడీ కాలనీ వద్దనున్న ఎస్‌డబ్ల్యూసీ ప్లాంట్‌ను డీపీవో పరిశీలించారు. అనంతరం స్థానిక బాలాజీ కాలనీ, జ్యోతినగర్ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణను తనిఖీ చేశారు. ఇంటింటా పొడి, తడి చెత్త సేకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రభురెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి, సెంట్రింగ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలకు నియామక పత్రాల అందజేత


సురేంద్రరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న బాలగురవంబాబు, దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ కమిటీలకు శనివారం సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి పొందిన ఎస్‌కే కరీముల్లా, శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు సురేంద్రరెడ్డి తదితరులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళిందర్, చెరుకుతోట రాహుల్, మునిరాజా, చందు, అజిత్, నాగరాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

ప్రతి ఇంటిపై బీజేపీ జెండా ఎగరాలి

కేవీబీపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంటిపై బీజేపీ జెండా ఎగురేటట్లు చూడాలని బీజేపీ మండలాధ్యక్షుడు బాబు యాదవ్ చెప్పారు. శనివారం రాయపేడులో ఇంటిపై జెండా ఎగురవేసి ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఏం అందిస్తుంది.. రాష్ట్ర ప్రభుత్వం ఏం అందిస్తుందనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రైవేటు పాఠశాల వాహనాల తనిఖీ

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలల్లోని వాహనాల ఫిట్నెస్‌ను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడితో కలిసి డీఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. శనివారం మండల పరిధిలోని పాపానాయుడుపేటలో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు చెందిన వాహనాల కండీషన్, ఆర్‌సీ, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్‌ను తనిఖీ చేశారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. సీఐ జయచంద్ర, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు శనివారం తనిఖీ చేశారు. బస్సులఫిట్‌నెస్‌ను పరిశీలించి డ్రైవర్లకు తగు సూచనలు చేశారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఎయిర్‌పోర్టు రోడ్డులో సీడబ్ల్యూసీ గోడౌన్ల ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రేణిగుంట డీఈఈ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి, ఛైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహనరావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్ పాల్గొంటారని చెప్పారు. తిరుపతి డివిజన్ పరిధిలోని టౌన్ 1,2,3, రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లకు, మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చని రమేష్‌బాబు పేర్కొన్నారు.

కార్పొరేషన్ సబ్సిడీ లోన్లకు ఇంటర్వ్యూలు పూర్తి

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండల పరిధిలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ సబ్సిడీ లోన్లకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏవో పిచ్చిరెడ్డి పర్యవేక్షణలో శనివారం ఎస్బీఐ 2, కెనరా బ్యాంకు 2, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఐవోబీ బ్యాంకు మేనేజర్లు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మంజూరైన 74 లోన్లకుగాను 534 మంది దరఖాస్తు చేసుకోగా, సాయంత్రం 4 గంటల లోపు 350 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బ్యాంకు నిబంధనల మేర 74 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు 'కజారియా' రూ.లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న కజారియా పరిశ్రమ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం కజారియా పరిశ్రమ యాజమాన్యం రూ.లక్ష చెక్కును అందజేశారు. దీనిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

భూత వాహనంపై నీలకంఠుడి దివ్య స్వరూపం

- శాస్త్రోక్తకంగా యాగశాల పూజలు


నాగలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె సర్వమంగళా సమేత పల్లికొండేశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భూత వాహనంపై నీలకంఠుడి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వం పొందారు. భక్తజనుల కోలాహలం, వేదమంత్రోచ్చారణలు, కోలాటాలు, నృత్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య పరమేశ్వరుడు భూత వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. మరగదాంబికా అమ్మవారు తిరుచ్చి వాహనంపై ఆసీనులై స్వామివారితో పాటు తిరువీధి సంచారం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

శాస్త్రోక్తంగా యాగశాల కార్యక్రమాలు

శైవాగమ శాస్త్రోక్తంగా యాగశాల వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వర్షాలు సక్రమంగా పడి రుతు ధర్మాలు సక్రమంగా జరిగి లోక కళ్యాణం జరగాలన్న సంకల్పంతో బ్రహ్మోత్సవాల్లో నిత్యహోమాలు జరుపుతున్నారు. ఉదయం ఆలయ శుద్ధి, గోపూజ అనంతరం మూలస్థాన దేవతా మూర్తులు వాల్మీకేశ్వరుడు, మరగదాంబికా అమ్మవారిని అలంకరించి పట్టు వస్త్రాలతో, వివిధ పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం వాహన సమర్పణ అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. వాహనసేవతో కార్యక్రమాలను పరిసమాప్తి చేశారు. ఈ పూజలకు చెన్నైకి చెందిన జగన్నాధం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది దండపాణి, పరంధామరెడ్డి పర్యవేక్షించారు.



భూత వాహనంపై స్వామి, అమ్మవార్లు - యాగశాల మండపంలో హారతి పడుతున్న అర్చకులు




శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి వెండి అంబారీపై పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు - ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వేదపండితులు - సారె తీసుకెళుతున్న ఈవో బాపిరెడ్డి, బృందమ్మ తదితరులు




పెద్ద శేష వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు - ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

పరశురామేశ్వరస్వామి ఆలయంలో
శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లీ సమేత పరశురామేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద శేష వాహనం, కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బాలకృష్ణారెడ్డి, ప్రీతిరెడ్డి దంపతులు, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కుమార్తె నితీషారెడ్డి వ్యవహరించారు. ఆలయ మాజీ ఛైర్మన్ గిరి నాయుడు, ఈవో రామచంద్రారెడ్డి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. 23న స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, నెమలి వాహనం, 24న ఉదయం వృషభ వాహనం, రాత్రి కామధేనువు, 25న ఉదయం సింహ వాహనం, రాత్రి రావణబ్రహ్మ, 26న ఉదయం పల్లకిసేవ, రాత్రి కల్యాణ మహోత్సవం, 27న ఉదయం అధికార నంది, రాత్రి పార్వేట ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలోనిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆహుతులను అలరించాయి. సాయంత్రం 3.30గంటలకు లాస్యప్రియ కూచిపూడి నృత్యంతో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 4.30గంటలకు పట్టణానికి చెందిన మోహనాచారి భక్తిరంజని, 5 గంటలకు వేదిత శ్రీహాసిని, 5.30గంటలకు తిరుపతికి చెందిన వనం కల్యాణి, 6గంటలకు పట్టణానికి చెందిన పోలయ్య, 6.30గంటలకు హైదరాబాద్‌కు చెందిన భాగ్యమ్మ నృత్య ప్రదర్శనలు భక్తులను మైమరిపించాయి. రాత్రి 11గంటలకు తొట్టంబేడుకు చెందిన శ్రీవిఘ్నేశ్వర నాట్యమండలికి చెందిన గురుస్వామి ప్రదర్శించిన కర్ణ శీను నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

చావిడిని కూల్చడం తప్పిదమే

- మండల సమావేశంలో తహసీల్దార్


మండల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నాగలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం పంచాయతీ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద ఉన్న అతి పురాతనమైన చావిడి భవనాన్ని కూల్చి షాపింగ్ కాంప్లెక్స్ కట్టడం ఘోర తప్పిదమేనంటూ తహసీల్దార్ హనుమాన్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రత్నమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. నాగలాపురం ఎంపీటీసీ ప్రేమా సెల్వకుమార్ మాట్లాడుతూ నాగలాపురం మండలానికి మాత్రమే ఐకేపీ కార్యాలయానికి సొంత భవనం లేదని, ఇందుకు షాపింగ్ కాంప్లెక్స్ వెనుక వైపు ఉన్న చావిడి ఖాళీ స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ పురాతనమైన చావిడి స్థలంలో ఎటువంటి కార్యాలయాలు నిర్మించడానికి అనుమతిలేదని స్పష్టంచేశారు. తాత ముత్తాతల కాలంగా ప్రజలకు చావిడి ఎన్నో సేవలందించిందని, అటువంటి చావిడిని కూల్చి పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం ఘోర తప్పిదమేనంటూ అప్పటి వైసీపీ నేతల ఆగడాలను పరోక్షంగా చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని చూపిస్తే ఐకేపీ భవనానికి స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ తెలిపారు. తదనంతరం ఆయా శాఖల మండలాధికారులు వారి పరిధిలోని అభివృద్ధి పనుల వివరాలను సభ్యులకు వివరించారు. కాగా సమావేశం ముగించక ముందే సభ్యులు కొంతమంది సమావేశం నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సింధూ, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీడీవో నాగరత్నం, తహసీల్దార్ హనుమాన్ నాయక్, అన్నీ మండలశాఖాధికారులు పాల్గొన్నారు. కాగా ఇద్దరు చిన్నారులు మేము సైతం అంటూ మొదటి నుంచి ఆఖరివరకు కూర్చుని సమావేశంలో జరిగిన అంశాలను శ్రద్ధగా వినడం విశేషం.

ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో కిందపడిన విద్యార్థిని


బస్సు వెనుక పరుగులు తీస్తున్న విద్యార్థినులు

నాగలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బస్సు ఆపండంటూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు పరిగెత్తుతూ వస్తున్నా ఆపకుండా ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లడంతో ఓ విద్యార్థిని పరిగెడుతూ కిందపడి స్వల్ప గాయాలపాలైంది. వివరాలిలా.. శనివారం సాయంత్రం నాగలాపురం మండల పరిధిలోని కారణి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పాఠశాల ముగిసిన తరువాత సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బస్సు ఎక్కడానికి రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో సత్యవేడు ఆర్టీసీ డిపో నుంచి వచ్చిన ఏపి39-టీఎఫ్ 1347 నెంబరు గల బస్సు తిరుపతికి వెళుతుండగా కారణి గ్రామం వద్ద కొంతమంది విద్యార్థినులు బస్సును ఆపి ఎక్కగా మరికొంతమంది ఆపమంటూ కేకలు వేస్తూ పరుగులు తీశారు. అయితే డ్రైవర్ గమనించినా కూడా బస్సును ముందుకు సాగించడంతో వెనుకవైపు నుంచి పరుగులు తీసిన ఓ విద్యార్థిని రోడ్డుపై బోర్లా పడిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు, స్థానికులు కేకలు వెయ్యడంతో డ్రైవర్ బస్సును ఆపి విద్యార్థినులను ఎక్కించుకున్నారు. దీనిపై సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను వివరణ కోరగా.. విచారించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం

- డీఈవో కేవీఎన్ కుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని డీఈవో కేవీఎన్ కుమార్ అన్నారు. పట్టణంలోని సరస్వతిబాయి పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గైడ్ కెప్టెన్ల ట్రైనింగ్ క్యాంపును శనివారం ఆయన సందర్శించారు. అనంతరం స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్‌బౌంట్ బేడన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో గైడ్ కెప్టెన్ ట్రైనింగ్ తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్ ట్రైనర్ శకుంతలమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పిరెడ్డి, అసిస్టెంట్ ట్రైనర్ ధనలక్ష్మి, ఎంఈవో భువనేశ్వరి, కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.